# పిచ్చివాళ్ళు

''ఓ మిల్టన్ మహాశయా!''

మానవుడి ఆశల్లా దూరం దూరంగా గానుగచెట్లు సాయంకాలపు నీడలు పాకుతూన్న సమయంలో సులోచన నడిచి వచ్చింది.

గోపీ సులోచన రాక గుర్తించలేదు. కళ్లు తెరిచే ఉన్నాయి. మనసక్కడ లేదు. టేబిల్‌కెదురుగా ఉన్న చేతులకుర్చీలో రెండు కాళ్లూ పైకి లాక్కుని, తల కుర్చీ కానించి, సాంబ్రాణిధూపంలా అల్లుకొన్న ఆలోచనల్లో నిమగ్నుడై ఉండగా, టేబిల్‌మీద సగం వ్రాసిన కాగితాలు గాలికి రెపరెపలాడుతూంటే - ''అయ్యా! మిల్టన్‌దొరగారూ!'' అని రెండోసారి పిలిచింది సులోచన.

ఇహలోకంలో అడుగుపెట్టినగోపీ, సులోచన పిలుపు అవహేళనగా స్ఫురించగా కాళ్లచుట్టూ చేతులు బిగించుకొని, అసహనంగా, ''వచ్చావూ! రా...'' అన్నాడు.

ఎర్రగా, సన్నగా, ఎప్పుడూ తమలపాకులు వేసుకున్నట్టుండే ఎర్రటి లేత పెదాలతో, ఆడపిల్లలా ఉండే గోపీకి, చదువుకునే రోజుల్లో సహవిద్యార్థులంతా కలిసి 'మిల్టన్' అని నామకరణం చేశారు. అదీకాక గోపీ వ్రాసే భావకవిత్వం, వ్యాసాలూ, మరీ అతని దళసరి కళ్లద్దాలూ ఆ నామధేయాన్ని సార్థకం చేసేటట్టుండేవి.

ఎవరైనా తనను 'మిల్టన్' అని పిలిచినప్పుడు బాగా కోపం వచ్చేది గోపీకి. వీళ్లంతా తనను గేలిచేస్తున్నారు, తన కవిత్వాన్ని హేళన చేస్తున్నారు అని కొండంత కోపంతో వాళ్లతో మాట్లాడేవాడుకాదు. ఒక్కోసారి పట్టలేక కళ్లవెంట నీళ్లుకూడా వచ్చేవి గోపీకి.

కొంత కాలానికి ఆ పిలుపు అలవాటయినా, విసుగ్గా, నిస్పృహగా ఉన్నప్పుడు అలా పిలిస్తే అసలు పలికేవాడేకాదు.

''నాన్నగారు 'నీ కవిగారు కనపట్టం లేదేం ఈమధ్య?' అని అడిగారు. పొద్దస్తమానం గూట్లో కూర్చుని గుర్రాల్తోలకపోతే మా ఇంటికోసారొస్తే ఏం పోయిందో!'' టేబిల్‌మీది ధూళిని ఊది కూర్చుంటూ అంది సులోచన. తెల్లటి చీరెలో, పాలవెల్లువలా, సంధి చిహ్నంలా, సన్నగా, పొడుగ్గా, తెల్లగా ఉన్న సులోచన వైపు చూస్తూండిపోయాడు భయంభయంగా గోపీ.

''పిచ్చాడిలా అలా చూస్తావేం... వచ్చిన పని చెప్పనీ..... ఇదిగో, ఈ భగవాన్ లాటరీస్

టికెట్ ఒకటి తీసుకొని రూపాయి ఇచ్చెయ్యి. ఫస్టు ప్రయిజు అయిదు లక్షలు. సెకండ్ ప్రయిజు మూడు లక్షలు. ఇంకా పాతిక చిన్న ప్రయిజులు ఉన్నాయి.''

''వద్దు, సులోచనా!... నాకు లాటరీలంటే అసహ్యం...''

''ఏం?''

''ఏం లేదులే.... టైమ్ వేస్టు..... ఇంకెక్కడయినా ప్రయత్నంచెయ్యి....''

''అలా ఏం వదలను.... నాన్నగారికి అరడజను టిక్కెట్లు అంటగట్టాను. ఆయన లాటరీ వస్తుందని తీసుకున్నారనుకున్నావా.... నేనిచ్చాననికాని...''

''అదికాదు, సులోచనాదేవీ! ఈ లాటరీలు నాకిష్టంలేదు. కష్టపడకుండా ముఫత్‌గా డబ్బు సంపాదించాలనే మానవుడి బలహీనతని ఎక్స్‌ప్లాయిట్ చేయటమేగా..'' కొంచెం బాధగా అన్నాడు గోపీ.

''అందరి బలహీనతలేమో కానీ, నీ బలహీనతలు నన్ను చంపేస్తున్నాయి బాబూ! నీ ఆలోచనలెప్పుడూ ఈ ప్రపంచానికి సంబంధించినట్టుండవు. చూడు, ఈసారి - మన బంగారు చేతిమీదుగా ఇస్తున్నాం.... ఫస్టుప్రయిజు తప్పదు. ఈ విధంగా ఓ అయిదు లక్షలు నీలాంటివాడి చేతిలో పడితే సద్వినియోగమవుతుందనే నా ఆశ...''

ఆమె కింకెలా నచ్చచెప్పాలో తోచలేదు గోపీకి. ఒక్కో క్షణంలో కోపం వస్తుంది. 'ప్రతిసారీ వచ్చి తన బలహీనతల్నీ, పిరికితనాన్నీ, అలౌకికత్వాన్నీ హేళన చేయకపోతే, తన మానాన తనని బతకనివ్వకూడదూ?'

''యు ఆర్ ఎ ప్రిజనర్ ఆఫ్ ఇన్‌డెసిషన్... ఇదిగో, లాటరీ టిక్కెట్టు... నీజేబులో రూపాయి తీసుకెళుతున్నా...''

''ఏయ్, సులోచనా! ఉన్నదా ఒక్క రూపాయే... చాలా ఇబ్బంది పడిపోవలసి వస్తుంది. నామాట విను....'' ప్రాధేయపడుతూ గుమ్మందాకా వెంబడించాడు గోపీ.

''ఏం ఫర్వాలేదు... మన భాగ్యానికి రూపాయి పోతే లోటేం లేదు... వస్తా...''

సులోచన వెళ్లిపోయింది.

తిరిగి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు గోపీ... తన చేతకానితనానికి కోపంగా ఉంది... చేతిలో ఉన్న ఒక రూపాయీ వృథాగా పోగొట్టుకున్నాడు. తన దారిద్ర్యాన్ని అవహేళన చేస్తూ, మసక వెలుతుర్లో రాక్షసిలా కనుపిస్తున్న టేబిల్‌మీది లాటరీటిక్కెట్టును విసురుగా సొరుగులో వేశాడు.

ఇక్కడ కొంచెం సులోచనా గోపీల గురించి చెప్పాలి. సులోచన తండ్రి ధర్మావతారంగారు మొదట్లో పల్లెలోనే ఉండి, పట్నంలో కాంట్రాక్టువ్యాపారం అదీ చేస్తూ ఉండేవాడు. వ్యాపారంలో కొంత అభివృద్ధి సాధించిన తరువాత ఆయన మకాం పట్నానికి మార్చేశాడు. గోపీది కూడా అదే

పల్లె కావటంవల్ల, గోపీని చిన్నప్పటినుండి ఎరుగును ధర్మావతారంగారు. ఆ చనువుతో గోపీ ధర్మావతారంగారింటికి వెళ్లటం కద్దు. ధర్మావతారంగారి భార్య శ్యామలాదేవి కూడా గోపీని చాలా ఆదరంగా చూసేది.

ధర్మావతారంగారిది అసలే సంపన్న కుటుంబం. ఆపైన ఆయన కంట్రాక్టుపనుల్లో చాలా ధనం గడించాడు. రాజకీయనాయకుల్లో ఆయనకున్న పలుకుబడికూడా చాలా గొప్పదే.

చాలామంది బీదవాళ్ళకు ధనవంతులంటే ఓ విధమయిన విరోధభావం ఉంటుంది. ప్రపంచంలో జీవితావసరాలకు చాలక ధనాభావంతో తాము కష్టాలు పడుతూంటే, ధనిక వర్గం విలాసంగా డబ్బు వెదజల్లుతున్నదనే ఓ భావం బీదవాడిని ధనికుడితో కలపలేక పోతోంది. కాని, గోపీకలా అనిపించేదికాదు. ఎమ్.ఎ. పాసయినా ఏ ఉద్యోగమూ చేయాలనిపించేదికాదు గోపీకి. గోపీ మనస్సు చాలా సున్నితమయింది. దరిద్రనారాయణుల కష్టాలు చూసి అతని మనస్సు ఆర్ద్రమయి పోయేది. సమాజం... జాతి జీవన మార్గమెంత పతనమయిందో... దాని లక్ష్యానికది ఎంత దూరంగా పోతూందో తలిచినకొద్దీ తపన ఎక్కువై పోయేది గోపీ మనస్సులో. తనూ, తన సమాజమూ, సంఘసేవా కార్యక్రమాలూ, సమావేశాలూ, సంభాషణలూ - ఇవే అతడి కాలంలో ఎక్కువభాగం తీసుకొనేవి. సంఘసేవే తన ధ్యేయంగా ఎంచుకున్న వ్యక్తి, దానినుండి తన భుక్తికైనా సరే ప్రతిఫలంగా ఏమీ ఆశించకూడదనే గాంధిమహాత్ముని వాక్యం మనస్సులో మెదిలి, తన భుక్తికి ఎక్కడైనా రెండు మూడు ట్యూషన్లు చెప్పుకుంటూ ఉండేవాడు. కొంత భాగం అతను వ్రాసే వ్యాసాలకూ, కథలకూ, కవితలకూ ప్రచురించిన పత్రికలవారిచ్చే ప్రతిఫలంతోనే గడిచిపోతూండేది.

గోపీకి వెనుక నా అన్నవాళ్ళెవరూ లేరు. తల్లీ తండ్రీ చిన్నప్పుడే చనిపోయారు. ప్రజల దయాధర్మాలమీద కష్టపడి చదువుకున్నాడు. సహజంగా తెలివిగలవాడవటంవల్ల అతని కాలేజీ ఫీజులూ అవీ స్కాలర్‌షిప్‌లతో గడిచిపోయేవి. స్నేహితుల పుస్తకాలతో కాలం గడిపేసేవాడు. ధర్మావతారంగారు కూడా అప్పుడప్పుడూ గోపీకి సహాయం చేసేవాడు.

వివాహం చేసుకుని సంసారజీవితం గడపటం కాదతని జీవితలక్ష్యం. సేవా కార్యక్రమాల్లో తన జీవితమంతా గడిపేయాలని అతని కమనీయ వాంఛ. అదే అతని సర్వస్వం.

ఇలాంటి గోపీ లౌకికుల దృష్టిలో ఉత్త తెలివితక్కువవాడుగా కనుపించేవాడు.

సులోచనకు తెలుసు - గోపీ ఎంత ఉత్తమమైన వ్యక్తో, గోపీ మనసు ఎంత సున్నితమో, ఓ చిన్న కఠోర వాక్యమయినా అతన్నెంత విచలితుణ్ణి చేస్తుందో. ఈ బలహీనుడికి మరో వ్యక్తి అవసరమెంతో పూర్తిగా గుర్తించింది సులోచన. అయినా గోపీ యిది తెలుసుకునే స్థితిలో లేడు. అతడికీ విషయం తెలియజెప్పాలనే ప్రయత్నంలో సులోచన రకరకాలుగా ప్రయత్నించేది.

ఓసారి...

గోపీ సహపాఠులు కొందరు, సులోచన కలిసి గోపీని యీ కూడూ గుడ్డ పెట్టని సేవా ప్రవృత్తినుండి ఎలాగైనా మళ్ళించాలనే వుద్దేశ్యంతో గోపీ గదికి వెళ్ళారు. గోపీ ఎంత వాదంలోకి దిగనివాడైనప్పటికి ఎక్కుపెట్టిన బాణాలు తీవ్రంగా లక్ష్యాన్ని ఆఘాత పరుస్తుంటే గోపీ ఊర్కొనే కూర్చుని వుండలేకపోయాడు. సులోచన గోపీని నొప్పించటమే ధ్యేయంగా పెట్టుకొని మాట్లాడిందారోజు.

''యిదంతా వ్యామోహంగా కాదా సులోచనా! యీ వ్యామోహంలో పడ్డ నేను బయటకు తొంగయినా చూడగలవా....''

''నీ అంత వ్యామోహి ప్రపంచంలో లేడు. పెళ్ళిచేసుకుని సంసార లంపటంలో పడటం నీకిష్టం లేదు. సమస్త సంసార బంధాలను తెంచుకొని అన్నిటికీ అతీతంగా వుండాలనుకుంటున్నావేమో, అన్నిటికీ అతీతంగా వుండాలనే నీ మోహం, ప్రపంచంలోని సర్వ ప్రలోభాలకంటె మిన్నయైనదే గోపీ!'' ఉద్రేకంగా అన్నది సులోచన.

''అదేం కాదు సులోచనా! వాడికి జీవితం అంటే భయం. ఎస్కేపిస్ట్... నువ్వెంత దూరం పారిపోయినా అది నీవెంటే వస్తుందిరా. సులోచనా! వాడికి జీవిత మంటే పిరికితనం... నేను నిరూపించేదా... వాడిని అర్థం లేని సంఘకార్య క్రమాన్ని వదిలేసి ఉద్యోగం చెయ్యమను చూద్దాం... పోనీ పెళ్ళిచేసుకోమను... యిదో విధంగా జడత్వం.'' సవాలుగా మాట్లాడుతున్నాడు కేశవమూర్తి.

మిత్రులు సిద్దంచేసుకువచ్చిన తూణీరంలోని బాణాలన్నీ సూటిగా తగులుతుంటే పట్టలేనట్లు మాట్లాడాడు గోపీ.

''ఉద్యోగమూ, పెళ్లీ జీవిత పరమావధి కాదుగదా! యీ రెండింటిలోనే జీవితాన్ని చూడాలనేదేమీలేదుగా. నా సంఘ కార్యక్రమాల్లోగాని, ఓ రోగికి సేవచేస్తున్నప్పుడైనా, ఓ సంక్షేమ నిధికి చందాలు వసూలుచేస్తూ ఊరూఊరూ తిరిగేటప్పుడూ ప్రజల్ని జాగరితంచేసే మాప్రయత్నాల్లోనూ మేము జీవితాన్నే ఎదుర్కొంటున్నాం. దానికి భయపడి పారిపోయే పిరికి తనం మాలో లేదు.''

ఆ మాటలు విని సులోచన పగలబడి నవ్వింది.

''ఆ పనుల్లో నీకు నిజమైన ఆసక్తిలేదు. నీవుచేసే పనుల్లోని అంతిమ ప్రతిఫలం నిన్ను లోభపెట్టేదికాదు. రిజల్ట్ మీద నీకు ఆశలేనప్పుడు ఎద్దు భారంగా బరువీడ్చినట్లు, ఎటు పోతే అటు లాగేస్తావ్. నీ సొంతపనిలో, దాని విజయం మీదుండే ఆత్రుత, మనోక్షోభ నీసేవా కార్యక్రమాలమీద వుండవు. అందులో నువ్వు జీవితాన్ని ఎదుర్కొనేదేమీ లేదు. ప్రతిఫలం ప్రలోభ పూర్ణమైనప్పుడు నిష్ఠగా నీ కార్యక్రమాన్ని సాగిస్తే మేమందరం ఒప్పుకుంటాం - మాగోపీ పిరికివాడు కాదు, ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కొంటున్నాడని.'' అన్నది సులోచన.

''నువ్వే ఒప్పుకుంటున్నావుగా సులోచనా! ఉద్యోగం, సంసారం ప్రలోభం కలిగిస్తాయని.

నువ్వన్నట్లు నీటిలో దిగి, నీచేత ధైర్యవంతుణ్ణనిపించుకున్నా నాకు ఒరిగేదేమిటి? నేను నిర్మించుకున్న సాలెగూడులో నేను చిక్కుకుని బయట వాళ్ళనసలు చూడగలనా....?''

అని ఓ క్షణమాగి మొదలెట్టాడు గోపీ.

''ఈ అర్థంలేని వాగ్యుద్ధమెందుకూ. నా ఇంటెగ్రిటీనే అనుమానిస్తే నేను చెప్పేదేమీలేదు. ఈ సేవాకార్యక్రమం నాస్వంతం.... ఎంత స్వంతమంటే.... మనకు ఆకలి వేయటం ఎంత సహజమో, అలా బాధాపరితప్తుణ్ణి చూసి నా హృదయం సంకులిత మవటం అంత సహజం. ఆకలివేస్తే అన్నం తినకపోతే ఎలా జీవించలేమో, సేవా కార్యక్రమాన్ని విడచి నేను జీవించగలనా! ఇది స్వార్థమే అనుకోండి. నేను బ్రతికుండాలంటే యీ పనిచేయాలి. నేను చిన్నప్పుడే అనాథుణ్ణి, దరిద్రుణ్ణి అయినా యీ సంఘం, ప్రజలు ఎంతో దయగా నన్నీస్థితికి తీసుకువచ్చారు. వాళ్ళకి సేవచేయటం తప్ప నేను చేయగలిగిందేముంది?'' అని చెమ్మగిలిన కళ్ళతో మాట్లాడే గోపీ మాటలకు - అతని మాటల్లోని సత్య సంధతకు - నివ్వెరపోయి ఎవరూ మాట్లాడలేక పోయారు.

గోపీలో తోటి మానవుడిమీదగల సహానుభూతి ఎలా రక్తంలో ఒక పదార్థమైవుందో గ్రహించేటప్పటికి - హిమాలయం ముందు నిలబడ్డ భీరువుల్లా వుండి పోయారు.

అలా చాలా సార్లు గోపీని అతని వ్యాపృత్తి నుండి మళ్ళించటానికి ప్రయత్నించింది సులోచన.

ఎలాగైనా అతణ్ణీ ప్రవృత్తి నుండి దూరం చేయాలి. ఇతనెంత బలహీనుడు. ఇతనికి తోడుకావాలి. తను చేయికలిపి అతణ్ణే అతని లక్ష్యం వైపు ఎంతో శీఘ్రంగా తీసుకువెళ్ళకలదు. ఆ ప్రయత్నంలో అతని పరిధిని విరగ్గొట్టి ఎలాగయినా లోపల ప్రవేశించాలి అనే ఉద్దేశ్యంతో, ఏ ఋషి తపస్సునో, ఇంద్రుడు పంపగా భగ్నం చేయప్రయత్నించే అప్సరకన్య మనః ప్రవృత్తిని అలవరచుకుంది సులోచన. ఆమనః ప్రవృతితోనే గోపీని అడిగేది.

''మా నాన్నగారిచేత నీకేదయినా ఉద్యోగమిప్పిస్తాను చెయ్యరాదు. యీ ట్యూషన్ల మీదొచ్చేది నీ తిండికయినా చాలుతుందా? ఉద్యోగంచేస్తూ, నీ అవసరాలకుపోనూ మిగతా డబ్బు నీకార్య క్రమాల్లో వినియోగించుకోవచ్చుగా.''

గోపీ ఆమె మాటలను వినేవాడుకాదు. ఆమె కూడా అతడు తన మాటలను విని ఉద్యోగం చేయాలని కోరుకొనేది కాదు. అతడు నిజంగా ఉద్యోగం చేయటానికి యిష్టపడితే అతడు తన ఆదర్శాలకు దూరమయి, తన ఇష్టదేవత పదభ్రష్టమైనట్లు ఆమె ఎంతో బాధపడేది. కాని యిలా మాట్లాడటం అతని పరిధిలోకెలాగయినా చొచ్చుకుపోవాలనే ఉద్దేశ్యంతో గురిపెట్టి వదలిన బాణం.

ఒక్కోసారి గర్వభంగమైన దేవకన్యలా గోపీనీ ప్రార్థించేది. ''పోనీ అవ్వేమీ వద్దుగాని గోపీ...

పెళ్ళిచేసుకో... నీకు తోడుకావాలి... నాకు తెల్సు... నా మాటనమ్ము - నీకు ఆసరా యివ్వటానికి ఓ జోడీకావాలి...''

గోపీ ఏమీ అర్థంకాని వాడిలా ఆమెకేసి అలా చూస్తూండి పోయేవాడు. యీ లాటరీ టిక్కెట్టు అంటగట్టి అతనికి బాహ్య ప్రపంచంతో సంబంధం కలిగించానని కొంత సంతోష పడింది.

ధర్మావతారంగారు గోపీ తమ ఇంట్లో కాని, కూతురు సులోచనతోకాని తిరగటం ఇష్టం లేకపోయినా అభ్యంతర పెట్టలేదు. ఆయనకు నమ్మకంగా తెలుసు- ఈ దౌర్భాగ్యుడు ఆడపిల్లలను ఏవిధంగానూ ఆకర్షించలేడని, కాక్షించలేడని. అందుకనే చూసీ చూడనట్లుండేవాడు ఆయన.

సులోచన లాటరీ టిక్కెట్టు అంటగట్టి వెళ్ళిన రెండుమూడు రోజులకుగాని గోపీకి ధర్మావతారంగారింటికి వెళ్ళటానికి తీరిక దొరకలేదు. తీరా వెళ్తే ఆయనలేడు. ఎక్కడికో పనిమీద వెళ్ళాడు. శ్యామలమ్మగార్ని పలకరించి తిరిగి వెళ్ళిపోదామనుకుంటూండగానే, సులోచన ప్రత్యక్షమయింది.

''మిల్టన్ మహాశయా! ఇవాల్టికి తీరిక దొరికిందన్నమాట మీకు... పదండి అమ్మను చూద్దురుగాని... నాన్న కాంట్రాక్టుల పనిమీద వెళ్ళారు....''

శ్యామలాదేవి ఎదుటే లాటరీ టిక్కెట్టు చర్చ వచ్చింది. సులోచన తానెలా గోపీకి లాటరీ టిక్కెట్టు అంటగట్టిందీ, గోపీ ఎలా మొండికెత్తిందీ, తానెలా విజయం సాధించిందీ వివరిస్తూ బిగ్గరగా నవ్వుతోంది సులోచన.

''నీకు డబ్బంటే ఆశలేదుగా... నాకు తెల్సు .... లాటరీలో ఫస్టు ప్రయిజు నీకే వస్తుంది. డబ్బుతో అవసరం లేని వాళ్ళకీ, దాని విలువ, ఉపయోగం తెలియని వాళ్ళకే వస్తుంది. ఆశతో ఎదురు చూసేవాడికి కోరింది లభ్యంకాకపోవటం జీవిత సత్యం.... ''నవ్వుతూ చెప్తోంది సులోచన. శ్యామలాదేవి కూతురు తెలివి తేటలకు ప్రగల్భంగా చూస్తోంది.

''వద్దులే సులోచనాదేవీ! నీకోసారి చెప్పాను. లాటరీలంటే నాకిష్టం లేదు. మానవుడి క్రియాశీల శక్తిని నాశనం చేస్తున్నాయీ లాటరీలు. కష్టపడి పనిచేయాలనే ప్రాథమిక సూత్రం మానవుడు విస్మరిస్తుంటే, కష్టపడకుండా వచ్చే యీ లాటరీ డబ్బుతో సుఖం కొనుక్కోవాలనే ఆశ ఆత్మవిస్మృతిలో పతాకస్థాయి. యింతమంది బీదవాళ్ళు తమకు లాటరీ వస్తుందనే ఆశల బలహీనతని మదుపు పెట్టి చేశారా ఫస్టు ప్రయిజు ఐదు లక్షల రూపాయాల్ని. ప్రతి ఒక్కరూపాయిలో నుండి ఓ మానవ హృదయం డబ్బుకోసం ఆక్రోశించినట్లనిపించదూ? అయినా నా కొస్తే నేనేం చేసుకుంటానాడబ్బు! నీలాంటి వాళ్లకొస్తే ఉపయోగం.''.

''భలేవాడివీ అలా అంటావేం.. నీ సేవాకార్యం కొనసాగించుకోవచ్చుగా..''

''లేదు సులోచనా.... ఈ డబ్బుతో నా సేవాకార్యం కొనసాగదు. అప్పుడు దానిలో పవిత్రత చెడిపోతుంది...''

''నీదో పిచ్చికాని బాబూ! లక్ష్మికి పవిత్రత, అపవిత్రత ఏమిటి?'' యీ సంభాషణంతా వింటూ యిక వుండబట్టలేక అంది శ్యామలాదేవి.

''డబ్బుకు కాదమ్మగారూ అది సాధింపబడే విధానంలోనూ, అది ఖర్చయే విధానంలోనే వున్నాయి దాని పవిత్రతాపవిత్రతలు. ఓ కార్యంలో లక్ష్యమొక్కటే ఉత్తమ మైనదయితే చాలదు. దాని సాధనా మార్గం కూడా ఉత్తమంగా వుండాలి.''

గోపీ మాటలు శ్యామలాదేవికి ఇష్టం. ''యీ పిచ్చివాడు ఎలా బ్రతుకుతాడీ ప్రపంచంలో'' అని తల్చుకున్నప్పుడల్లా ఆర్ద్రమయ్యేది ఆమె మనస్సు.

రోజులు గడిచిపోతూనే వున్నాయి నిర్మోహంగా

మూడునెలల తరువాత-

ఓ సుప్రభాతాన -

''మిమ్మల్ని లాటరీటిక్కెట్టు తీసుకుని బాబుగారు రమ్మన్నారు'' అని ధర్మావతారంగారి నౌకరు గోపీని పిలవరాగా లాటరీటిక్కెట్టు జేబులో పెట్టుకుని బయలుదేరాడు గోపీ.

''వచ్చావా, గోపీ! ఇప్పుడే వస్తాను.... రాధాస్వామిగారితో మాట్లాడుతూ ఉండు'' అన్నాడు డ్రాయింగురూములో నుండి లోపలికి వెళుతూ ధర్మావతారంగారు. రాధాస్వామి ఆయన ఆస్తి వ్యవహారాలు చూసే మానేజరు.

పది గంటలయినా కాలేదు. ఎండ తీక్ష్ణంగా ఉంది బయట. పైన సీలింగ్ ఫాన్ మెల్లగా తిరుగుతూంది. విశాలంగా ఉన్న సోఫామీద ఇరుకుగా కూర్చున్నాడు గోపీ.

రాధాస్వామి వయస్సు దగ్గర దగ్గర యాభై సంవత్సరాలు ఉంటాయి. నెరిసిన తలతో పెద్ద మనిషిలా కనుపిస్తాడాయన.

రాధాస్వామి మొదలుపెట్టాడు.

''చూడు, బాబూ! నువ్వు భగవాన్ లాటరీస్‌లో టిక్కెట్టు కొన్నావుకదూ? నీకు ఫస్టుప్రయిజు వచ్చింది. అభినందనలు, బాబూ! నాకో చిన్న సహాయం చేసి పెట్టాలి. పెద్దవాణ్ణి అడుగుతున్నాను. కాదనవంటే చెపుతాను...''

''భలేవారే! చెప్పండి... మీరడగటమేమిటి, కాదనటమేమిటి?''

''ఏం లేదు, బాబూ! అమ్మాయిగారి దగ్గరి కౌంటర్ ఫాయిల్స్‌లో ప్రయిజు వచ్చిన నంబర్ టికెట్ నీ పేరున చింపబడినట్లుంది. మన ధర్మావతారం బాబుగారికో పిచ్చి. లాటరీలో ఫస్టు ప్రయిజు వచ్చిందని, తన పేరు పేపర్లో పడితే చూసుకోవటం ఆయనకో సరదా - సంతోషం. అదో బలహీనత, బాబూ! అదిగో... అప్పుడే ముఖం తిప్పేస్తున్నావు. నీకు లాటరీలో వచ్చిన లక్షలు నాకొద్దు. ఓసహాయం చేసి పెట్టాలి.''

''ఏమిటది?''

''నీకు లాటరీలో వచ్చిన అయిదు లక్షల రూపాయలు ధర్మావతారం బాబిస్తారు. ఆ లాటరీ టిక్కెట్టు బాబుగారి పరంచేస్తే చాలు. రేపు భగవాన్ లాటరీ వాళ్ళిచ్చే పార్టీలు, సన్మానాలూ మాత్రం వదులుకుని బాబుగారి పేరున జరపబడేందుకు అనుమతించాలి.'' ఆత్రంగా చెబుతున్నాడు రాధాస్వామిగారు.

గోపీ ఏం మాట్లాడలేదు.

''ఏమంటావు, బాబూ!'' ఆత్రంగా ప్రశ్నించాడు.

''సరే. నాకా ఐదు లక్షల రూపాయలు మాత్రమెందుకు? నేనేం చేసుకుంటాను? బాబుగారి దగ్గరే ఉండనివ్వండి..''

''లేదు, బాబూ! నిష్ఠూరంగా మాట్లాడుతున్నావు. నీ మనస్సు కష్టపెట్టి ఈ పని చేయించదలుచుకోలేదు నేను. పైగా ఇంకేమన్నా కావాలంటే ఎక్కువ ఇప్పించే పూచీ నాది.''

''లేదండీ! నాకేం కష్టం! బాబుగారి ఈకాస్త బలహీనతని ఆసరాగా తీసుకుని ఇంకా పైన తీసుకునేదా? ఆయన నాకు చేసిన సహాయం నేనెలా మరిచిపోగలను, రాధాస్వామిగారూ. ఇదుగో, టికెట్ తీసుకోండి... నే వస్తాను'' అని గోపీ లేచాడో లేదో ధర్మావతారంగారు వచ్చాడు.

''ఈయనేమో డబ్బు వద్దంటున్నాడు, సార్... నేను చెప్పి చూశాను'' అన్నాడు మానేజరు.

''అయితే మనకెందుకతని టిక్కెట్టు? చూడు, గోపీ! నీకు డబ్బు ఎందుకు చేదో నాకర్థం కావటంలేదు. అన్యాయంగా నీదగ్గర టిక్కెట్టు తీసుకోవటం నాకిష్టం లేదు. నీ సంఘసేవలో ఎంతో ఉపకరిస్తుంది ఈ డబ్బు. కాదనక నువ్వొప్పుకుంటే ఇప్పుడే ఇచ్చేస్తాను'' అన్నాడు ధర్మావతారంగారు.

గోపీ ధర్మసందేహంలో పడిపోయాడు. తన ఆదర్శానుగుణంగా తనా లాటరీడబ్బు తీసుకోనంటే ధర్మావతారంగారు కష్టపడిపోతారు. ఆయన్నంత కష్టపెట్టటం తన కిష్టంలేదు. తనీ డబ్బు తీసుకోవటం తన ఆదర్శానికి వ్యతిరేకం. ఏం చేయాలి?

''సరే, మా గురువుగారిని అడిగి చెపుతాను. ఆయన అంగీకరిస్తే ఆ లక్షలు మా సేవా సమాజానికి మీపేరున విరాళంగా ఇచ్చేద్దురుగాని... అందాక డబ్బు మీ దగ్గరే ఉంచండి...'' అన్నాడు ఏం తోచక గోపీ.

''అలాగే, బాబూ... థాంక్స్...'' అన్నాడు ముసలి మానేజరు.

గోపీ లేచి గది దాటి బయటికి వచ్చాడో లేదో లోపల పెద్దగా నవ్వు వినిపిస్తోంది ధర్మావతారంగారిది. ఆశ్చర్యమనిపించింది గోపీకి.

''భలేవాడివోయ్, రాధాస్వామీ! ఒక్క దెబ్బతో రెండు పిట్టలు కొట్టేశావ్! పబ్లిక్‌గా వచ్చే

లాటరీతో మన బ్లాక్ మనీ ఐదు లక్షల వరకూ వైట్ మనీ అయిపోయింది. దానికి మనం ఇన్‌కమ్ టాక్స్ కట్టుకోవచ్చు. రెండు మూడు లక్షలు ఆ సేవాసమాజానికి విరాళంగా ఇచ్చేమంటే పుష్కలంగా పేరు పడిపోతాం. ఆ పిచ్చి గాడిదకు ఇవేమీ అర్థం కాలేదు.''

ధర్మావతారంగారు అన్న మాటలు గోపీకి సరిగా అర్థం కాలేదు మొదట. ఏవేవో రకరకాలయిన ఆలోచనలు చుట్టుముట్టుతున్నాయి. ఆయన మాటలు రెండు మూడుసార్లు మననం చేసుకుంటే ఏవేవో వింత వింత అర్థాలు గోచరిస్తున్నాయి. ఆలోచించగా, ఆలోచించగా స్ఫురించిన అర్థాలు తన మనస్సును పిండి చేస్తూంటే లాన్‌లో పచ్చగడ్డిమీద కూర్చుండిపోయాడు గోపీ.

తన అమాయకత్వంతో ఎలాటి అనర్థం జరిగిపోయింది! ఇది ఇలా జరిగిపోవలసిందేనా? విరుగుడు ఏమయినా ఉందా? తను ఇదంతా సహించి ఊరుకోగలడా? ధర్మావతారంగారు చేసే దుర్మార్గాలు లోకులు చెపుతున్నా ఇట్లాంటి వికృతపద్ధతిలో గోముఖవ్యాఘ్రంలా, తేనెపూసిన కత్తిలా ఉంటాయని తను ఊహించుకోలేకపోయాడు. గోపీకి కోపం కట్టలు తెంచుకుని ప్రవహించినట్లయింది.

లేదు. ఈ అన్యాయం, అక్రమం తను జరగనివ్వడు. ఏమైనా- తను సర్వనాశనమైనా దీన్ని ఆపేయాలి. లక్షల రూపాయల బ్లాక్ మనీ చలామణీలోకి రావటానికి వీల్లేదు. అలాంటి అక్రమం తను జరగనివ్వడు.

గోపీ లేచి పోర్టికోగుండా డ్రాయింగ్ రూమువైపు బయలుదేరాడు. పోర్టికోలో నిలబడ్డ రెండు మూడు కార్లను అతను గమనించనేలేదు.

హాల్లో ప్రవేశించగానే గోపీని గుర్తించి బయటకు వచ్చాడు రాధాస్వామి.

''నాకా టిక్కెట్టు మీకివ్వటం నా కిష్టం లేదు... తిరిగి ఇచ్చెయ్యండి'' అన్నాడుగోపీ.

''ఏం బాబూ! ఏమయింది?''

''నేనేం చెప్పదలచుకోలేదు. మీరు చేసిన కుట్ర నా కర్థమయింది. నా టిక్కెట్టు నాకిచ్చెయ్యండి.'' అని పెద్దగా మాట్లాడుతున్న గోపీ మాటలకు - ''ఏమయింది? అలారా బాబూ! ఆ గదిలో మాట్లాడుకుందాం...'' అన్నాడు రాధాస్వామి.

''లేదు. ఈ విషయం ఇక్కడే తేలిపోవాలి. అదుగో, ధర్మావతారంగారినే అడుగుతాను....'' అని ఎవరో పెద్దమనుష్యులతో మాట్లాడుతున్న ధర్మావతారంగారి దగ్గరకే పోబోయాడు. గోపీకి మొదటినుండి లౌకికజ్ఞానం తక్కువ. ఎంత కోపమున్నా కొత్తవాళ్ల మధ్య ఇంకొకరి జీవితరహస్యాల్ని బయటపెట్టకూడదనే ఇంగితం లేదు. రాధాస్వామి గోపీని ధర్మావతారంగారి దగ్గరికి వెళ్ళకుండా చాలా ప్రయత్నించాడు. కానీ గోపీ ఆగలేదు.

''మీరు నా దగ్గర విషయం దాచారు. మీ బ్లాక్‌మనీ వైట్ మనీ చెయ్యటం కోసం నేనివ్వలేదా టిక్కెట్టు! నా టిక్కెట్టు నా కిచ్చేయండి...'' అని ఊపుగా వెళ్లి అడిగేశాడు గోపీ ధర్మావతారంగారిని.

''ఏం టెక్కూట్టు?'' అడిగాడు ధర్మావతారంగారు సౌమ్యంగా. గోపీకి సంయమనం నశించినట్లయిపోయింది.

''ఏం తెలీనట్లు మాట్లాడకండి... మీ దుర్మార్గం నాకు తెలిసిపోయింది. నేనిది జరగనివ్వను....'' దయ్యం పట్టినట్లుగా మాట్లాడేస్తున్నాడు గోపీ.

''రాధాస్వామిగారూ... ఈ పిచ్చివాణ్ణి ఇక్కడికెందుకు రానిచ్చారు... ఈ వేళయినా తీసుకువెళ్లి నేను చెప్పానని పిచ్చాసుపత్రిలో చేర్పించండి... మొన్నే చెప్పాను... ఇంకా చెయ్యలేదు మీరు... పాపం! ఓ విధివంచితుణ్ణి బాగుచేసిన వాళ్లమయినా అవుతాం... అని.''

''ఇలాంటి నిర్భాగ్యుల్ని చూస్తే నా హృదయం తరుక్కుపోతుంది సుమండీ... దేవుడు అన్యాయం చేశాడు... మనమూ చూస్తూ ఊరుకోవలసిందేనా? మనకు చేతనయినంతలో మన బాధ్యత మనం నిర్వహించాలి. కదా... ఏదో పెద్ద మెంటల్ షాక్ తగిలి ఉంటుంది- మొన్నకూడా ఓసారి ఇలాగే వచ్చాడు ప్రపంచమంతా తనను అన్యాయం చేసినట్లు ఊహించుకొని కనపడ్డ ప్రతివాణ్ణీ తిడుతూ ఉంటాడు. ఇతన్ని ఎవరో ఘోరంగా మోసం చేసి ఉంటారు. అప్పటి నుండి ఇలా పిచ్చివాడయి ఉంటాడు.'' అని పక్క సోఫాల్లో కూర్చున్న పెద్ద మనుష్యులతో చెపుతున్నాడు ధర్మావతారంగారు. అంతలోనే రాధాస్వామి పిలిచిన గూర్ఖా, నౌకర్లు గోపీని బలవంతాన ఆ గదిలోనుండి నడిపించుకు వెళ్లారు.

గోపీని మెంటల్ హాస్పిటల్లో జాయిన్ చేశాడు ధర్మావతారంగారు, తన పలుకుబడిని ఉపయోగించి. గోపీ పిచ్చికి అక్కడ చికిత్స జరుగుతోంది.

నెల రోజుల క్రితం చుట్టంచూపుగా గుంటూరు పినతండ్రి ఇంటికి వెళ్లి వచ్చిన సులోచనకు, గోపీ పిచ్చాసుపత్రిలో ఉన్నట్టు తెలిసింది. విషయం అర్థం చేసుకోవటానికి ఆమెకెక్కువ సేపు పట్టలేదు. తండ్రి దగ్గర హఠం వేసుకుని, గోపీని పిచ్చాసుపత్రినుండి డిశ్చార్జి చేయించటంలో కృతకృత్యురాలయింది. గారాబాల కూతురి మాటలు కాదనలేక పోయాడు ధర్మావతారంగారు.

ఆరోజు పొద్దుట పది గంటలకు మెంటల్ హాస్పిటల్‌కు బయలుదేరింది సులోచన. ఆరోజే గోపీని డిశ్చార్జి చేసేది.

మెయిన్ గేటునుండి దూరంగా ఉన్న మెంటల్ హాస్పిటల్ బిల్డింగ్స్ వైపు కారులో పోతున్న సులోచన మనసు మనస్సులో లేదు. ఈవేళ ఆమె హృదయం కరుణాతరంగితమై ఉంది. 'గోపీ నిజంగా పిచ్చివాడు. అతనికీ లోకం సరిగ్గా అర్థం కాదు. అతని ఈ పిచ్చికి సరైన శిక్షే పడింది' అని ఓ క్షణం కోపంగా అనుకుంది. మరుక్షణం అలా అనుకున్నందుకు తనను తనే నిందించుకున్నది ఆమె. హిమాలయపర్వతంలా ఉన్నతమైన గోపీ గోచరించాడామె మనస్సులో. పర్వతంమీద ఉన్న మంచువల్ల చలికి పర్వతం వణికిపోయేటట్లు - అతనిలోని బలహీనత, ఆసరా అవసరమైనా గుర్తించలేని అమాయకత్వం... తలుచుకునేప్పటికి ఆమెకు కళ్లలో నీళ్లు తిరిగినట్లయింది. 'ఈ

పిచ్చివాడు ఇలా ప్రపంచంలో బ్రతకలేడు. అతనికీ ప్రపంచం అర్థంకాదు. నడిసముద్రంలో చుక్కాని లేని నావలాటిదవుతుందతని జీవితం - తన ఆసరా లేకపోతే. ఇంక తను ఉపేక్షించలేదు. సర్వప్రలోభాలనూ త్యజించి అతని జీవిత నౌకకు చుక్కాని పట్టాల'ని నిర్ణయించుకుందామె మనస్సులో.

ఆకాశంలో నల్లటి మేఘాలు పరుచుకుంటున్నాయి. వాటిని చొచ్చుకొని నీరెండ కాస్తోంది.

సులోచనని చూడగానే పట్టలేక పోయాడు గోపీ.... ఓ క్షణం ఏడ్చేశాడు.

''చూశావా! సులోచనా! నాకు పిచ్చిపట్టిందట.... నిజమేనా.... చూడు, నా ఒళ్లు ఎలా వాతలు తేలిపోయిందో... పిచ్చి పోగొట్టటానికి కొడతారటగా.... నువ్వు.. నువ్వు ఎందుకింత ఆలస్యం చేశావు... వీళ్లు నన్ను చంపేద్దురు... నన్ను నీతో తీసుకెళ్లవూ.. నేనిక్కడ ఉండను... నాకు భయం వేస్తూంది... వాళ్లకు చెప్పి నన్ను తీసుకెళ్లు...''

ఆ జైలులో, ఆ హింసతో గోపీ మనస్సు ఎంత వికలమయిందో, ఎంత దిగజారిపోయిందో తలుచుకుంటే సులోచన హృదయం కంపించిపోయింది. నిజంగానే పిచ్చిపట్టే స్టేజికి తీసుకువచ్చారు వీళ్లు... కళ్లవెంట నీళ్లు వచ్చాయి సులోచనకు.

''పిచ్చివాడా...! నేను చెపితే విన్నావూ... పిచ్చివాళ్ళకు పిచ్చివాళ్లతోనే పొత్తు... ఈ తెలివిగల ప్రపంచంలో అడుగెందుకెట్టావ్.... పద...'' దుఃఖంతో సులోచన కంఠం రుద్ధమయి ఆపైన ఆమె మాట్లాడలేకపోయింది. తల్లిలా అతన్ని పొదివి పట్టుకుని నడిపించుకుపోయింది.

పోర్టికోలో నిలబడ్డ కారు డ్రైవరుతో అంది సులోచన :

''నువ్వు పద కారు తీసుకుని... మేం మెల్లగా వస్తాం.''

అమ్మాయిగారి చండశాసనాలకు అలవాటుపడ్డ కారుడ్రైవరు మారుమాట్లాడకుండా కారులో వెళ్లిపోయాడు.

ఏడడుగులు నడిచారోలేదో, లోకుల విమర్శల చండనిపాతాల్లా, మేఘావృతమైన ఆకాశం గర్జిస్తూ తీవ్రంగా వర్షం ప్రారంభమయింది. హోరున ఈదురుగాలి. క్షణంలో బీభత్సమయి పోయినట్లయింది ప్రకృతి.

హాస్పిటల్ మెయిన్ గేటువైపు పోతున్న కాలిబాటమీదుగా సాగిపోయారు, పూర్తిగా వానలో తడిచిపోయిన పిచ్చివాళ్లిద్దరూ.

'ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక

29-7-1970